# గాయం

-దుర్గాభాస్కర్


"మమ్మీ! డాడీ ఇంకా రాలేదా?" చేతివేలి కున్న బేండేజ్‌ని చూసుకుంటూ అంది శ్వేత.

"వస్తారమ్మా... వచ్చేటైమైంది..." వీధిలోకి చూస్తూ జవాబిచ్చింది రమ.

ఎక్కడా కారు వస్తున్న జాడలేదు.

ఆయన వస్తుంటే ఆ కారు శబ్దాన్ని ముందే పసిగట్టేయగలదు రమ... రమేకాదు శ్వేతకూడా.

క్రింద పోర్టికోలో కారు ఆగిన శబ్దం కాగానే రమ గుమ్మంలోకి, శ్వేత కారు దగ్గరకు వస్తారు. డాడీ బ్రీఫ్ అందుకుని ఎంత వేగంగా వెళ్లిందో అంతవేగంగా వెనక్కి పరుగెత్తుకొస్తుంది శ్వేత. ఆమె వెనుకే "శ్వేతా! పరుగెత్తకు పడ



తావ్..." అంటూ తనూ పరుగులాంటి నడకతో పాపవెనుకే వస్తాడు దశరథ్.

భార్యని చూడగానే అతడి ముఖంలో కంగారు స్థానంలో చిరునవ్వు ప్రత్యక్షమవుతుంది. ఇద్దరూ కలసి లోపలికి వస్తారు. ఇక ఆ ముగ్గురిదీ వేరే ప్రపంచం, మళ్లీ తెల్లవారే వరకూ!

తెల్లవారగానే రమ పనులతో సతమతమైపోతూనే ఉంటుంది. శ్వేత స్కూల్‌కి, దశరథ్ ఆసుపత్రికి వెళ్లిపోతారు. అన్నిపనులూ తీరిగ్గా పూర్తిచేసుకుని వాళ్లకోసం ఎదురుచూడడం ఆమెకి సరదా.

ముందు శ్వేత వస్తుంది.

ఆమెకు ఏమైనా తినిపించి, కాసేపు పడుకోబెట్టి తను తయారవుతుంది. అప్పుడు దశరథ్ వస్తాడు.

ముగ్గురూ తయారై ముచ్చటగా ఏ టాంక్ బండ్‌కో, ఇందిరాపార్క్‌కో, సినిమాకో వెళ్లి హాయిగా గడిపి వస్తారు. వస్తూ వస్తూ ఏ హోటల్లోనో భోంచేసి వచ్చేరోజులూ ఉన్నాయ్!

ఈ రోజూ అలాగే తన పనంతా పూర్తిచేసుకుని శ్వేతకోసం ఎదురుచూస్తోంది.

మామూలుగా కేరింతలు కొడుతూ శ్వేత రాలేదు. రిక్షా అతను శ్వేతని ఎత్తుకొచ్చాడు.

"నేను గమనించలేదమ్మా... రిక్షా దిగేప్పుడు చిన్నమ్మగారి వేలికి ఇనుపరాడ్ గీసుకుపోయింది..." బిక్కు బిక్కుమంటూ రిక్షాఅతను చెప్పగానే, రమ శ్వేత చేతి వంక చూసింది.

చూపుడువ్రేలు నుంచి రక్తం కారుతోంది. చటుక్కున శ్వేత నతని చేతుల్లోంచి అందిపుచ్చుకుని "ఏమైందమ్మా..." అని అడిగింది రమ ఆతృతగా.

"రిక్షా దిగుతుంటే గుచ్చుకుంది..." అంత వరకు శ్వేత బిగబట్టిన దుఃఖం ఒక్కసారి కట్టలు తెంచుకుని ప్రవహించింది.

చటుక్కున ఆ వ్రేలును వాష్‌బేసిన్‌లో పంపుక్రింద ఉంచింది.

అలా కాసేపు వేలిమీద నీరు ధారగా పడి నతర్వాత రక్తం కారడం కొద్దిగా తగ్గింది. వ్రేలుని ఇవతలికి తీయగానే మళ్లీ రక్తం కారడం ప్రారంభమవుతోంది. వ్రేలిమీద తెగింది...

"పాప నేను దింపేలోపే దూకేసిందమ్మా..." రిక్షాఅతను ఏదో చెప్తున్నాడు.

రమకి అతని నిర్లక్ష్యంమీద విపరీతమైన కోపం వచ్చింది. కాని అతని ముఖం వంక జూసి ఏమీ అనలేకపోయింది.

"ఆ డెట్టాల్ బాటిల్...కాటన్ ఇవ్వు..."

అతను తెచ్చిచ్చాడు.

మరికొంచెంసేపు గాయంమీద నీరు పడేట్టు చేసి, డెట్టాల్‌తో ఆ వేలును శుభ్రపరచి, కట్టు కట్టింది.

భయం భయంగా అక్కడే నిల్చున్న రిక్షా అతన్ని చూడగానే చిరాకుతో "వెళ్లు పిల్లల్ని తీసుకువెళ్లడం, తీసుకురావడమే కాదు— వాళ్ల జాగ్రత్త చూడడం కూడా నీ పని..." కసురుకున్నట్లుగా అంది రమ.

"నేను వెయ్యికళ్లతో గమనిస్తూనే ఉంటానమ్మా..."

"అతని మాటల్ని మధ్యలోనే త్రుంచి వేస్తూ "వెయ్యికాదు లక్ష కళ్లతో గమనించు... మళ్లీ ఇలా జరగకూడదు" వార్నింగ్ ఇచ్చింది.

"అలాగేనమ్మా..."

"వెళ్లింక..."

రమ కూతుర్ని మంచంమీద పడుకోబెట్టి, ప్రక్కనే కూర్చుని బిస్కెట్స్ తినిపించసాగింది.

"డాడీ ఇంకా రాలేదామ్మా..." తన దెబ్బ చూసి డాడీ ఎంత ఆదుర్దాపడతాడోనని ఆ చిన్నిహృదయం ఆలోచిస్తోంది. ఆ ఆదుర్దా తనకి కావాలి... అందుకే కావాలనే గాయం చేసుకుంది. లేకపోతే ఇంటికి వచ్చిందిమొదలు డాడీ తనకంటే మమ్మీతోనే ఎక్కువగా మాట్లాడతారు!" అనుకుంది భరించలేని ఆ చిన్నిహృదయం...

అమ్మ ఏ పని చేసుకోకుండా తనప్రక్కనే ఉంది. డాడీ కూడా అలాగే ఇవాళంతా తన ప్రక్కనే ఉండాలి—అదీ ఆ చిన్నిమనసు కోరిక.

సమయం గడిచిపోతోంది.

ఇద్దరూ డాక్టర్ దశరథ్ కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.


ఎదురుచూసినకొద్దీ ఆలస్యమైనట్టు రోజూ ఆరుగంటల కల్లా వచ్చేసే దశరథ్ ఏడైనా రాలేదు.

నిముషాలు యుగాలుగా గడుస్తున్నాయి.

ఏడున్నర ప్రాంతంలో దశరథ్ వచ్చాడు.

"ఇంతాలస్యం ఎందుకైందండి..." వాకిట్లోనే భర్తని నిలేసింది రమ.

"ఇవాళ ఓ మేజర్ సర్జరీ చేశాను. పాపం ఎవరో పూర్‌ఫెలో కల్లుగీస్తూ తాటిచెట్టు మీద నుంచి క్రిందపడ్డాడు. మల్టిపుల్ ఫ్రాక్చర్స్... అవయవాలన్నీ ఓపెన్‌చేసి, ఎముకల్ని ఎడ్జెస్ట్ చేసి ఆపరేషన్ పూర్తి చేసేసరికి ఈ సమయమైంది. దశరథ్ ముఖంలో అలసట విపరీతంగా కనిపిస్తోంది.



"చూడు చూడుమని ఇవాళే మీకు ఆలస్యమైంది. ఇవాళే శ్వేత చేయి కోసుకుంది..." భార్య నోటివెంట ఆ మాటలు వచ్చీరాకముందే బూట్లని చటుక్కున విప్పేసి బెడ్‌రూమ్‌లోకి దూసుకెళ్లాడు దశరథ్.

"చిట్టితల్లీ... నా బ్రీఫ్ తీసుకువెళ్లడానికి నువ్వు రాకపోతే ఆలస్యమైందని కోపం వచ్చిందనుకున్నాను. చేయి తెగిందా... ఎక్కడమ్మా..." పిల్లని ఒళ్లోకి తీసుకున్నాడు దశరథ్.

"ఇదిగో ఇక్కడ..." వ్రేలుని చూపించింది శ్వేత.

"ఎలా తగిలిందమ్మా..." కట్టుని విప్పుతూ అడిగాడు దశరథ్.

"రిక్షా దిగుతుంటే చేయి తెగిందిట... ఎంత రక్తం కారిందని..." భార్య ముఖంలో భయం, ఆందోళన.

"నా గౌను నిండా కూడా రక్తం పడింది డాడీ..." శ్వేత కళ్లలో నీళ్లు తిరిగాయి.

"నీకేం భయం లేదమ్మా... నేనున్నాగా..." శ్వేత వేలి కట్టుని తీసేశాడు దశరథ్.

"ఇంతపెద్ద సర్జన్ ఇంట్లో ఉండి అవసరానికి నేనే ఏదో వైద్యం చెయ్యాల్సివచ్చింది" భర్తవంక జూస్తూ చిన్నగా నవ్వింది రమ.

దశరథ్‌కి భార్య మాటలకి నవ్వు రాలేదు. కూతురు తెగిన వ్రేలుని చూసేసరికి బాధనిపించింది.

"పాపం...చర్మం చీలింది..." రమ అంది.

"ఎంత రక్తం కారిందని డాడీ...ఇంకా నొప్పిగా ఉంది..." శ్వేత గారాబంగా అంది.

ఆ గాయం వంకే చూస్తున్నాడు దశరథ్. చూపుడువ్రేలు చివరిభాగం రెండుగా చీలింది.

"అబ్బా...చూడలేను...కట్టు కట్టేయండి..." భార్య మాటలు అతనికి వినిపించలేదు.

"నొప్పిగా ఉంది డాడీ..." కూతురు మాటలూ అతనికి వినిపించినట్లు లేదు.

అలాగే గాయం వంక చూడసాగాడు.

అతని కళ్లవెంట నీరు ధారగా కారసాగింది.

"ఏమిటండి...అంతపెద్ద సర్జను అంతగా డీలాపడిపోతారు... అది చిన్నగాయమే కదా... రేపటికల్లా మానిపోదూ దానికే ఆ కన్నీరెందుకు..." భర్త కళ్లవెంట నీళ్లు చూసి ధైర్యం చెబుతున్నట్లుగా అంది రమ.

తన కన్నీళ్లు కూతురు గాయం చూసి కాదని, ఇంతచిన్న గాయానికే కూతురు, తల్లి ఇంతగా గాబరాపడుతుంటే-ఇందాక తను ఆపరేట్ చేసిన మల్టిపుల్ గాయాలైన వ్యక్తి తాలూకు వాళ్లు ఎంతగా గాబరాపడి ఉంటారు. ఇంత చిన్న కోతకే పాప ఇంతగా తల్లడిల్లిపోతోంది! తొడ, మోకాలు, మడమ, చేతులు, వీపు-అన్నిచోట్లా ఆపరేషన్‌కు తను అతని శరీరంమీద పరపరా కోసాడు. అప్పుడనిపించని బాధ ఇప్పుడు ఈ పాప బాధని చూస్తే అనిపిస్తోందేమిటి? అతడి కడుపులో దేవినట్లనిపించింది.

ఈ భావాల్ని బయటకు చెప్పలేడు...చెప్పినా వాళ్లర్థంచేసుకోలేరు.

"నేను కట్టు కడతాగా నీ నొప్పి తగ్గిపోతుంది..." కళ్లు తుడుచుకుంటూ బేండేజ్ కట్టడానికుపక్రమించాడు డాక్టర్ దశరథ్.

పాప కళ్లలో వెలుగు-

భర్త ప్రేమకి రమలో ఆనందం-

దశరథ్ మనసులో మాత్రం అదోవిధమైన దిగులు, ఎవ్వరికీ చెప్పుకోలేని దిగులు...!

## జీన్‌లతో చికిత్స!

అనేక వ్యాధులకి బాధ్యత వహించే జీన్‌లను శాస్త్రవేత్తలు గుర్తిస్తున్నారు. మానవ జీనోమ్ ప్రాజెక్ట్‌లో మానవ జీన్‌లు మొత్తం విశ్లేషించడానికి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కృషి ఫలితంగా త్వరలోనే అనేక వ్యాధులకి కారణమైన జీన్‌లను గుర్తించడం జరుగుతుంది. దంత వైద్య శాస్త్రంలో విప్లవాత్మకమైన మార్పులు జరగనున్నాయి. ప్రిడిక్టర్ మెడిసిన్ అనే సరికొత్త వైద్య శాస్త్ర విభాగం ఇప్పుడిప్పుడే ఆవిర్భవిస్తోంది. మనిషికి వ్యాధి లక్షణాలు కనిపించక ముందే ఆ వ్యక్తి జీన్‌లను బట్టి ఫలానా వ్యాధి భవిష్యత్తులో వచ్చే సూచనలున్నాయని తెలుస్తుంది. అటువంటి వ్యక్తులను గుర్తించి వారిని ముందుగానే హెచ్చరించి తగిన వైద్య జాగ్రత్తలు తీసుకోవడం సాధ్యమవుతుంది. కొన్ని ప్రమాదకారకాలను తప్పించుకునే మార్గాలను తెలుపవచ్చు. ఇప్పుడు పెనిసిలిన్ ఇస్తున్నట్లే వచ్చే శతాబ్దంలో వ్యాధులకి జీన్‌ల తో చికిత్స చేసే అవకాశం కనిపిస్తోంది. వ్యాధి నిర్ణయం, చికిత్సలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.

కంటి వ్యాధులు అనేకం ఆనువంశిక కారణాల వల్ల వస్తాయని ఇటీవల శాస్త్రవేత్తలు కనుక్కున్నారు. క్రోమోజోమ్ దోషాల వల్ల వచ్చే కంటి జబ్బులు కొన్ని ఉన్నాయి. ఊ —రెటినో బ్లాస్టోమా, యానిరిడియా (అంటే) ఐరిస్ లేదా కంటి పాప లేకపోవడం), బ్లిఫరో ఫైమోసిస్ (అంటే కంటి రెప్ప రంధ్రం చిన్నదిగా ఉండడం) మొదలైనవి. అంతేకాక ఒకే జీన్ దోషం వల్ల వచ్చే కంటి వ్యాధులు కూడా ఉన్నాయి. రోడాప్సిన్ అనే రసాయనం ఒక ప్రొటీన్. ఇది క్రాంతి గ్రాహక కణాలు లేదా రాడ్స్‌లో ఉంటుంది. ఇవి రెటినా లేదా నాడీమండలంలో ఉంటాయి. కంటి నాడీ వరుసనే రెటినా అంటారు. రోడాప్సిన్‌లో మ్యుటేషన్ వల్ల రెటినైసిట్ పిగ్మెంటోసా అనే వ్యాధి వస్తుంది. దీనివల్ల రేచీకటి వస్తుంది. ఈ మ్యుటేషన్ వల్ల రెటినా లోకి విటమిన్ ఏ రవాణా దెబ్బతింటుంది. విటమిన్ ఏ హెచ్చు మోతాదుల్లో ఇచ్చి ఈ వ్యాధికి చికిత్స చేయడం సాధ్యం కావచ్చు.

బ్లిరోఫైమో,న్ జీన్ క్రోమోసోమ్ 7 మీద ఉన్నట్లు కనుక్కున్నారు. మన దేశంలో కంటి జబ్బుల్లో ప్రధానమైనది కంటిలో శుక్లం లేదా కాటరాక్ట్. ప్రతి సంవత్సరం సుమారు నాలుగు మిలియన్ మందికి ఈ కంటి జబ్బు వస్తోంది. ఇందుకు బహుశా కారణం జన్యు కారకం కావచ్చు. నారో యాంగిల్ గ్లాకోమా అనే మరొక కంటి జబ్బు కూడా ఇండియాలో ఎక్కువ ఉంది. ఇది అంధత్వానికి దారితీయవచ్చు. ఇది కూడా జన్యు కారకాల వలన వస్తుందని పరిశోధనలు చెబుతున్నారు.

-ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి